# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

మంగళవారం 6, జనవరి 2026


## గంజాయి రహిత జిల్లాగా కృషి చేయాలి

★ ఎస్పీ అఖిల్ మహాజన్




**బజార్‌హత్నూర్, జనవరి 05, ప్రభాతవార్త:**

గంజాయి రహిత ఆదిలాబాద్ జిల్లాకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ సోమవారం అకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కేసుల దర్యాప్తును నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ, వేగంగా నిర్వహించాలని, పోలీస్ స్టేషన్ ను పరిశుభ్రంగా ఉంచాలని, బాధితుల పట్ల గౌరవంగా వ్యవహరించాలని అన్నారు. రోడ్డు భద్రతా నియమాలు, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, రికార్డుల నిర్వహణను సక్రమంగా జరగాలని అన్నారు. విపిఒ విధానాన్ని అమలు చేస్తూ, గ్రామాలను మిగతా 2లో..

# రైతుల సమస్యలను పరిష్కరించాలి

★ మాజీ మంత్రి జోగు రామన్న






**ఆదిలాబాద్, జనవరి 5, ప్రభాతవార్త:**

రైతుల పక్షాన బిఆర్ఎస్ పార్టీ చేపడుతున్న నిరసన కార్యక్రమాల్లో మా ప్రాణాలను సైతం ఫణంగా పెట్టి రైతు సమస్యల పరిష్కారానికి ముందుంటామని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. సోయా కొనుగోళ్లలో అధికార యంత్రం నిర్లక్ష్యంతో పాటు ఎంపీ, ఎమ్మెల్యే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వైఖరితో రైతాంగం పూర్తిగా మోసపోతా ఉంటే జిల్లా కలెక్టర్ వేసిన కమిటీ సైతం రైతుల పక్షాన మోసపూరితంగా తయారైందని మాజీ మంత్రి జోగు రామన్న ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో మాజీ మంత్రి జోగు రామన్న ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో రైతులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ర్యాలీగా తరలివచ్చి కలెక్టరేట్ ముందర బైఠాయించారు రైతు వ్యతిరేక విధానాలపై విధానాలతో హోరెత్తించారు. రైతులకు న్యాయం జరిగేంతవరకు బిఆర్ఎస్ పార్టీ ఆందోళన కార్యక్రమం చేపడుతూ ఉంటుందని హెచ్చరించారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవిని కలిసి వినతి పత్రం అందజేశారు. రైతు సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఈ సందర్భంగా జోగు రామన్న మాట్లాడుతూ. సోయా కొనుగోళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వంతో పాటు స్థానిక ఎమ్మెల్యే పాయల శంకర్ డ్రామాలు చేస్తున్నాయన్నారు. సోయా కొనుగోలుపై ఎమ్మెల్యే పాయల్ శంకర్ కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రిని అఖిలపక్షంతో కలిసి కలవాల్సి కన్నా నైతిక బాధ్యత ఉందన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో 75 కొనుగోలు చేసి కేంద్రంతో 20 కొనుగోలు చేయించామన్నారు. కేంద్రం తగ్గుముఖం పట్టిన రాష్ట్ర మిగతా 2లో..




## ఈవీఎం గోదాంను తనిఖీ చేసిన కలెక్టర్

**ఆదిలాబాద్, జనవరి 5, ప్రభాతవార్త:**

ఈవీఎం గోదాం భద్రత నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్ల పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక శాంతినగర్‌లోని ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్లు (ఈవీఎంలు) భద్రపరిచే గోదాంను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రతి నెలా నిర్వహించే సాధారణ తనిఖీల్లో భాగంగా గోదాంను సందర్శించిన కలెక్టర్, అక్కడి భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరాల పనితీరు, ఈవీఎంలపై ఉన్న సీల్‌ల స్థితి, ప్రవేశ, నిష్క్రమణ రిజిస్టర్లు తదితర అంశాలను నిశితంగా పరిశీలించారు. ఈవీఎంల భద్రతలో ఎలాంటి లోపాలకు తావు లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ సూచించారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసం పెంపొందించడంలో ఈవీఎంల సంరక్షణ కీలకమని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం గోదాంలో నిర్వహణ ఉండాలని, భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని హెచ్చరించారు. ఈ తనిఖీలో ఎన్నికల విభాగం పర్యవేక్షకురాలు పంచపూల, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మోసం చేసి తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వాలని ఆందోళన



దేవాపూర్‌లో సీపతి రంజిత్ కుమార్ ఇంటి ముందు బాధితుల ధర్నా

**బెల్లంపల్లి, జనవరి 05, ప్రభాతవార్త**

భూమి ఇస్తామని చెప్పి మోసం చేసి తీసుకున్న రూ.20 లక్షల డబ్బులు తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేసూ కాసిపేట మండలంలోని దేవాపూర్‌లో సీపతి రంజిత్ కుమార్ అనే వ్యక్తి ఇంటి ముందు మంచిర్యాల ఎంసీసీ శ్రీనివాస కాలనీకి చెందిన చీపిరిశెట్టి సుధాకర్ తన కుటుంబంతో ఆందోళనకు దిగారు. డబ్బులు తీసుకున్న సీపతి రంజిత్ కుమార్ ఇంటి ముందు కుటుంబంతో సహా టెంట్ వేసి మరీ బైఠాయించి ధర్నాకు దిగారు. 2020లో సీపతి రంజిత్ కుమార్ భూమి అమ్ముతామని చెప్పి రూ.20 లక్షలు తీసుకొని మోసం చేశాడన్నారు. డబ్బులు తిరిగి ఇవ్వాలని అడగగా మిగతా 2లో..

పోలీస్ అధికారులు సిబ్బంది విధి నిర్వహణలో

## ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలి

★ జిల్లా ఎస్పీ నితిక పంత్



**రెబ్బెన, జనవరి 5, ప్రభాతవార్త :**

శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, పోలీస్ అధికారులు సిబ్బంది విధి నిర్వహణలో ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ నితికా పంత్ సూచించారు. సోమవారం రెబ్బెన పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాలు, నమోదు చేసిన రికార్డులు, పెండింగ్ కేసుల పురోగతి, స్టేషన్ హాజరు రిజిస్టర్, స్టేషన్ శుభ్రత తదితర విభాగాలను పరిశీలించారు. ఎస్పీ ఎస్‌హెచ్ఓ వెంకటకృష్ణ, స్టేషన్ సిబ్బందితో సమావేశమై మిగతా 2లో..

## గంజాయి రహిత జిల్లాగా కృషి చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

సందర్శిస్తూ, సమాచార వ్యవస్థను పటిష్టం చేసుకోవాలని, అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా యువత ప్రజలకు గంజాయి పట్ల అవగాహన కల్పించాలని, గుడుంబా, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. రోడ్డు భద్రతా మాసం కొనసాగుతున్న వేళ ప్రజలకు రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్న తీరును తెలియజేసి, సీట్ బెల్టు, హెల్మెట్ యొక్క ప్రాముఖ్యతను తెలియజేయాలని, రోడ్డు భద్రతా నియమాలను పాటించేలా ప్రోత్సహించాలని సూచించారు. కేసుల దర్యాప్తును నాణ్యత ప్రమాణాలతో కొనసాగిస్తూ బాధితులకు సరైన సమయంలో న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. దర్యాప్తు వేగవంతం చేసినప్పుడు తగు జాగ్రత్తలను పాటించాలని నిందితులకు శిక్షలు పడే విధంగా దర్యాప్తును కొనసాగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బోథ్ సీఐ డి గురు స్వామి, ఎస్సై సంజయ్ కుమార్, పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## దరఖాస్తులను పరిశీలించి త్వరగా పరిష్కరించాలి

**ఆసిఫాబాద్, జనవరి 5, ప్రభాతవార్త :**

ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ డేవిడ్, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు లతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులను స్వీకరించారు. జిల్లాలోని రెబ్బెన మండలం నారాయణపూర్ గ్రామానికి చెందిన దుర్గం అమ్మక్క గ్రామ శివారులో గల ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ అర్జీ సమర్పించారు.అదేవిధంగా కాగజ్ నగర్ మండలం అంకుసాపూర్ గ్రామానికి చెందిన సోగాల సోమయ్య తన పేరిట గ్రామంలో పట్టా భూమి ఉందని, మోకాపై తక్కువగా ఉందని చూపుతున్నారని, కొలతలు చేసి హద్దులు నిర్ధారించాలని, కాగజ్ నగర్ పట్టణానికి చెందిన కంపెల లలిత తన కుమారుడు భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తూ మరణించినందున భీమా డబ్బులు ఇప్పించాలని కోరుతూ, ఆసిఫాబాద్ మండలం ఈదులవాడ గ్రామానికి చెందిన మారేశెట్టి వెంకయ్య తాను సాగు చేస్తున్న భూమిని ఆన్ లైన్ లో ఎక్కించాలని, ఆసిఫాబాద్ మండలం చిర్రకుంట గ్రామానికి చెందిన రామ్ టెంకి అమ్మబాయి తన ఆధీనంలో గల వ్యవసాయ భూమిని పట్టా చేసి ఇవ్వాలని, కాగజ్ నగర్ మండలం దుర్గానగర్ కు చెందిన సుధీర్ మిస్త్రి తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని, పెంచికలపేట మండలం ఎల్కపల్లి గ్రామానికి చెందిన చందా కరుణాకర్ తనకు ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కొరకు ప్రభుత్వ స్థలం ఇవ్వాలని పలువురు అర్జీదారులు దరఖాస్తులు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చే ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వరమే పరిష్కరించే దిశగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని, దరఖాస్తుదారులకు భరోసా కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ అధికారులు సిబ్బంది విధి నిర్వహణలో ఎల్లప్పుడూ అపమ్రత్తంగా ఉండాలి

(మొదటిపేజీ తరువాయి)

పలు సూచనలు చేశారు. శాంతి భద్రతల పరిరక్షణలో ప్రతి పోలీసు సిబ్బందీ ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని, గ్రామాల్లో చట్టవ్యతిరేకచర్యలు, అసాంఘిక కార్యకలాపాలు, అక్రమ రవాణా, మాదకద్రవ్యాలపై దృష్టి సారించాలని ఆదేశించారు. స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదిదారుడితో, ప్రజలతో మర్యాదపూర్వ కంగా వ్యవహరించాలని అన్నారు. మహిళలు, బాలికల భద్రతకు సంబంధించిన కేసుల్లో ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, లా అండ్ ఆర్డర్ విషయంలో రాత్రిపూట పర్యవేక్షణ, పికెటింగ్, ప్యాట్రోలింగ్‌ను కచ్చితంగా కొనసాగించాలని సూచించారు. ప్రజాభద్రతకు విఘాతం కలిగించే వారిపై కఠినంగా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా ఎస్పీ వెంట రెబ్బెన సీఐ సంజయ్ ఉన్నారు.

## గంగాపూర్ జాతర ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ

**రెబ్బెన, జనవరి 5, ప్రభాతవార్త**

కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలోని రెబ్బెన మండలం గంగాపూర్ దేవాలయంను సోమవారం జిల్లా ఎస్పీ నితికా పంత్ సందర్శించారు. ఈ సందర్భంగా రానున్న జాతరను శాంతియుతంగా, సాఫీగా నిర్వహించేందుకు చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఎస్పీ దేవాలయ ప్రాంగణం,పరిసర ప్రాంతాలను పరిశీలించి, జాతర ఎక్కడ,ఎలా విజయవంతంగా నిర్వహించాలనే విషయాలపై సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. గుంపుల నియంత్రణ, ట్రాఫిక్ నిర్వహణ, భద్రతా ఏర్పాట్లు, అత్యవసర సేవలు, భక్తులకు అవసరమైన సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, పార్కింగ్ ప్రాంతాలు, ఊరేగింపు మార్గాలు, సున్నిత ప్రాంతాలలో తగిన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దేవాలయ కమిటీతో పాటు ఇతర శాఖలతో సమన్వయం చేసుకోవాలని తెలిపారు. జాతరను శాంతియుతంగా, క్రమబద్ధంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఎస్పీ నితికా పంత్ తెలిపారు. పోలీసులకు సహకరించి, సూచనలను పాటించడం ద్వారా జాతర విజయవంతానికి తోడ్పడాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో రెబ్బెన సిఐ సంజయ్, ఎస్సై వెంకటకృష్ణ,ఆలయ కార్యనిర్వణాధికారి వేణుగోపాల్ గుప్తా,ఆలయ నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

# రైతుల సమస్యలను పరిష్కరించాలి

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వం పూర్తిగా కొనుగోలు చేసిందని గుర్తు చేశారు. రైతాంగని ప్రోత్సహిస్తూ రైతుబంధు సకాలంలో వేసిన ఘనత కేసీఆర్ అని కొనియాడారు. నేడు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల విధానంతో రైతులు పూర్తిగా మోసపోతున్నారని. వ్యవసాయాన్ని ఖూనీ చేస్తూ కార్పొరేట్‌కు మద్దతుగా ప్రభుత్వాలు పనిచేయడం సిగ్గుచేటు అన్నారు. కేంద్రం కేవలం ఒక్క 133 కోట్ల రూపాయలను ఖర్చుతో రైతుల ధాన్యాన్ని పూర్తిగా కొనవచ్చు, కానీ బడా కార్పొరేటర్ల బాకీలు 12లక్షల కోట్లను ఏకకాలంలో రుణమాఫీ కేంద్ర ప్రభుత్వం చేసిందన్నారు. రైతులకు ఇవ్వడానికి మాత్రం కేంద్ర రాష్ట్రాల ప్రభుత్వాలు ముందుకు రాకపోవడంపై మండిపడ్డారు. ఉమ్మడి ఆదిలాబాద్‌లో ఇప్పటివరకు 29 మంది రైతులు చనిపోగా, కేంద్ర ప్రభుత్వాలకు కనువిప్పు కలగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దేశానికి అన్నం పెట్టే రైతాంగంపై కేంద్ర రాష్ట్రాలు ప్రభుత్వాలు పెడుతున్న నిబంధనలతో రైతు కుటుంబాల్లో తీవ్ర సంక్షోభం నెలకొంటుంది అన్నారు. కిసాన్ కాపాస్ యఫ్, తడిసిన ధాన్యం, రంగుమర్ల ధాన్యం, యూరియా కొరత, రైతు రుణమాఫీ, లేక అనేక ఇబ్బందులు రైతులకు ఎదురవుతున్నాయి అన్నారు. ఇకనైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దిగిరాకుంటే బిఆర్ఎస్ పార్టీ కార్యచరణ కొనసాగిస్తూనే ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు అజయ్, ఇజ్జగిరి నారాయణ, యాసం నర్సింగరావు, మెట్టు ప్రహ్లాద్, యూనిస్ అక్బాని, మారశెట్టి గోవర్ధన్, అడప తిరుపతి, బట్టు సతీష్, గణేష్ యాదవ్, దమ్మపాల్ కొండ, వాగ్మారె, ప్రశాంత్ పాల్గొన్నారు.

# మోసం చేసి తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వాలని ఆందోళన

(మొదటిపేజీ తరువాయి)

ఇవ్వకుండా తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారన్నారు. మా కుటుంబం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నామని, డబ్బులు ఇచ్చే వరకు తిరిగి వెళ్లమని బాధిత కుటుంబీకులు సీపతి రంజిత్ కుమార్ ఇంటి ముందు బైఠాయించి ఆందోళన చేపట్టారు. తమకు న్యాయం జరిగే వరకు ఆందోళన విరమించమని స్పష్టం చేశారు. దీంతో పోలీసులు చేరుకొని పోలీస్ స్టేషన్‌కు ఇరువురిని పిలిపించి మాట్లాడుతామని అప్పటి వరకు ఆందోళన విరమించాలని చెప్పడంతో ఆందోళన విరమించారు. అనంతరం కాసిపేట ప్రెస్ క్లబ్ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో బాధిత కుటుంబీకులు చీపిరిశెట్టి సుధాకర్, అనసూర్యలు మాట్లాడారు. 2020లో శ్రీనివాస గార్డెన్ వద్ద భూమి ఉందని, భూమి అమ్ముతామని చెప్పి రూ.20 లక్షలు దేవాపూర్ కు చెందిన సీపతి రంజిత్ కుమార్ తీసుకున్నట్లు తెలిపారు. డబ్బులు ఇచ్చి రాయించుకున్న పత్రాలు, తిరిగి ఇస్తామని రాసి ఇచ్చిన మొత్తం పత్రాలను, ఒప్పంద పత్రాలు సాక్షాలతో సహా చూపించారు. సింగరేణిలో పదవి విరమణ పొందగా వచ్చిన డబ్బులను మొత్తం పిల్లల భవిష్యత్తు కోసం భూమి కొనుగోలు చేసేందుకు సీపతి రంజిత్ కుమార్‌కు అందించినట్లు తెలిపారు. కాని భూమి ఇవ్వకుండా తిప్పించుకుంటున్నారని, తర్వాత మోసపోయామని గ్రహించినట్లు తెలిపారు. ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వాలని చెప్పగా ఆసలు స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు, అధికారులు తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో బాధిత కుటుంబీకులు కొండ వెంకటేష్, శృతి పాల్గొన్నారు.

# కాగజ్‌నగర్ ఇన్చార్జ్ అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ పై చర్య తీసుకోవాలి

### జాయింట్ కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చిన ఎంసిపిఐయు పార్టీ నాయకులు

**బెల్లంపల్లి, జనవరి 05, ప్రభాతవార్త**



కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ ఎంసిపిఐయు పార్టీ ఆధ్వర్యంలో వినతి పత్రం ఇవ్వడం జరిగింది. అనంతరం మంచిర్యాల జిల్లా ఎంసిపిఐయు పార్టీ జిల్లా కార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్, జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్ మాట్లాడుతూ కాగజ్‌నగర్ పట్టణంలోని అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ పై చర్యలు తీసుకోవాలని అదేవిధంగా, అసిస్టెంట్ లేబర్ ఆఫీసులో రెక్కడితేగాని డొక్కడిని అమాయక ప్రజల పట్ల ఇష్టాను సారంగా వ్యవహరిస్తూ, ఇన్చార్జ్ తీసుకున్న రోజు నుండి, 3,4 నెలలు కావస్తున్నా కూడా ఒక్క ఫైల్ ని కూడా ముందుకు పంపించకపోవడం అనేది చాలా సిగ్గుచేటు. ప్రభుత్వం నుండి వచ్చే బెనిఫిట్స్ సరిగ్గా అందించడం లేదని మూడు రోజులు ఇన్చార్జిగా ఉన్నప్పటికిని ఫోన్ చేస్తే గాని రెస్పాండ్ కాక ప్రజలను నానా ఇబ్బందులకు గురిచేస్తుందని వెంటనే పేద ప్రజలకు వచ్చే బెనిఫిట్స్ను అందేలాగా చూడాలని, అమాయక ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ను వెంటనే సస్పెండ్ చేయాలని, రెగ్యులర్ అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ను నియమించాలని లేనియెడల ఎంసిపిఐయు పార్టీ ఆధ్వర్యంలో తగు ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తామని హెచ్చరిస్తున్నాం అని అన్నారు.

### ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో

# షి టీమ్ అవగాహన సదస్సు

**లక్షెట్టిపేట, జనవరి 05, ప్రభాతవార్త**



రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు మంచిర్యాల డిసిపి భాస్కర్ పర్యవేక్షణలో మంచిర్యాల జిల్లా షి టీమ్ ఇంచార్జి ఉషారాణి ఆధ్వర్యంలో విద్యార్థినిల భద్రతను పెంపొందించేందుకు, షి టీమ్ ఆధ్వర్యంలో లక్షెట్టిపేటలోని ప్రభుత్వ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో షి టీమ్ అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో షి టీమ్ సిబ్బంది సతీష్, శ్రీలతలు మాట్లాడుతూ... షీ టీమ్ సేవలు,వాటి ఉద్దేశాన్ని గురించి వివరిస్తూ, ఎప్పుడూ అందుబాటులో ఉండే డయల్ 100 లేదా రామగుండం షి టీమ్ వాట్సాప్ నంబర్ 6303923700,మంచిర్యాల షి టీమ్ 8712659385 నంబర్లను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని సూచించారు. సోషల్ మీడియాలో గుర్తు తెలియని వ్యక్తులతో స్నేహం చేయడం, వ్యక్తిగత వివరాలు, ఫోటోలు పంచుకోవడం వంటి వాటితో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఆన్లైన్ వేధింపులకు గురైతే వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నంబర్ 1930 కి లేదా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. విద్యార్థినులు, మహిళల భద్రత కోసం టి సేఫ్ యాప్ మొబైల్లో డౌన్లోడ్ చేసుకుని, అత్యవసర పరిస్థితుల్లో దానిని ఉపయోగించే విధానం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా షి టీమ్ సిబ్బంది కానిస్టేబుల్ సతీష్, మహిళా కానిస్టేబుల్ శ్రీలత,పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

## - మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**నస్పూర్, జనవరి 05, ప్రభాతవార్త**

ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి.చంద్రయ్య, డిప్యూటీ ట్రైనీ కలెక్టర్ మహమ్మద్ విలాయత్ అలీ లతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. మంచిర్యాల పట్టణం రామ్ నగర్ కు చెందిన కోమాకుల పోచమ్మ తనకు లక్షెట్టిపేట మండలం ఉత్కూర్ చౌరస్తా శివారులో గల భూమిని కొందరు అక్రమంగా తీసుకున్నారని, ఈ విషయమై విచారించి తనకు న్యాయం చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. లక్షెట్టిపేట మండలం వెంకట్రావుపేట గ్రామానికి చెందిన తిప్పని అనిత తాను రిజిస్ట్రేషన్ దస్తావేజు ద్వారా కొనుగోలు చేసిన భూమిని తన పేరిట రెవెన్యూ రికార్డులలో జమాబంది చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. జన్నారం మండలం చింతలపల్లి గ్రామానికి చెందిన నాయిని లక్ష్మి గ్రామపంచాయతీ రోడ్డు నుండి తన ఇంటికి రాకపోకలు సాగించేందుకు గల త్రోవను ఉద్దేశం పూర్వకంగా మూసివేసి ఇబ్బందులకు గురి చేస్తున్నారని, తనకు న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. బెల్లంపల్లి పట్టణంలోని వార్డు నెంబర్ 32కు చెందిన బాల కవిత తాను ఇందిరమ్మ ఇంటి కొరకు దరఖాస్తు చేసుకోగా ప్రభుత్వ ఉద్యోగులుగా చూపిస్తుందని, తనకు ఉద్యోగం లేదని, వివరాలను సవరించి తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ ఆర్జీ సమర్పించారు. మంచిర్యాల పట్టణంలోని పాత గర్మిళ్ళ ప్రాంతానికి చెందిన అందే లక్ష్మి తనకు భూమి ఉందని ఇల్లు



నిర్మించుకునేందుకు ఇందిరమ్మ ఇంటి పథకం వర్తింపజేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మంచిర్యాల పట్టణం ఎన్.టి.ఆర్. నగర్‌కు చెందిన చింతల లక్ష్మి తన భర్త చనిపోయారని, ఎల్లంపల్లి బ్యాక్ వాటర్ ప్రమాదంలో తన కుమారుడు సైతం మృతి చెందినందున, తనకు ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. హైటెక్ సిటీ వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు మంచిర్యాల పట్టణంలోని 29వ వార్డులో విద్యుత్ దీపాలు, ఓపెన్ జిమ్ పరికరాల మరమ్మత్తులు, గ్రీన్ మ్యాట్ ఏర్పాటు, మూత్రశాలలు ఇతర సౌకర్యాలు కల్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి దరఖాస్తుల్లో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## సహజ వ్యవసాయంపై రైతులకు శిక్షణ

**జైపూర్, జనవరి 05, ప్రభాతవార్త**

పౌనుర్ గ్రామపంచాయతీలో సహజ వ్యవసాయం (నేషనల్ మిషన్ ఆన్ నేచరల్ ఫార్మింగ్ఎన్.ఎం.ఎన్.ఎఫ్)పై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.చెన్నూరు ఏడిఏ భానోత్ ప్రసాద్ మాట్లాడుతూ, రైతులు సహజ వ్యవసాయంలో భాగంగా పచ్చిరొట్ట ఎరువులైన జనుము, జీలుగ, పెసర విత్తనాలను దుక్కిలో వేసి పూత దశలో కలియదున్నాలని అన్నారు. రసాయన ఎరువులు, పురుగు మందులు ఉపయోగించకుండా, నీమాస్త్రం, బృహస్తం, పుల్లటి మజ్జిగను చీడ పీడలను అరికట్టడానికి వాడాలని, సహజ వ్యవసాయ పద్ధతుల ద్వార వ్యవసాయం చేయలని తెలిపారు. రసాయన ఎరువులు, పురుగు మందులను వాడడం వల్ల గాలి ,నీరు, నేల కలుషితం అయి జీవసారం కోల్పోతుందని అన్నారు. సహజ పద్ధతిలో సాగు చేస్తే మట్టి జీవ సరూప్యాతను సంతరించుకొని నాణ్యమైన దిగుబడి ఉత్పత్తి సిద్దిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డి.ఏ.ఓ పి.పి గోపి, మండల వ్యవసాయాయ అధికారి శివలీల, వ్యవసాయ విస్తరణ అధికారి, గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్, కృషి సచ సభ్యులు రైతులు హాజరయ్యారు.

## కౌటాలలో అడిషనల్ కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

**కౌటాల, జనవరి 05, ప్రభాతవార్త:**

కౌటాల మండలంలో అడిషనల్ కలెక్టర్, జిల్లా ఇంచార్జి విద్యాధికారి దీపక్ తివారి సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రైవేట్ విద్యాసంస్థ శ్యామ్ మోడల్ పాఠశాలను సందర్శించి అక్కడి మౌళిక వసతులు, రికార్డులను పరిశీలించారు. అనంతరం బోధంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించి పాఠశాల వసతులు, విద్యాబోధన సామర్థ్యాలు, తరగతి గదులలో జరుగుతున్న బోధన విధానాలను పరిశీలించారు.ఎస్.ఏ-1 పరీక్షలకు సంబంధించిన ప్రశ్నలను విద్యార్థులను అడిగి వారి విద్యా సామర్థ్యలను పరీక్షించారు. పరీక్షల్లో విద్యార్థులు మరింత మెరుగైన ఫలితాలు సాధించేలా అవసరమైన విధివిధానాలను రూపొందించాలని ప్రధానోపాధ్యాయులు అరుణ్ కు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి కోట ప్రసాద్, మండల విద్యాధికారి గావుడే హనుమంతు, సెక్రటరీ సుబ్బ సాయిక్రిష్ణలు ఉన్నారు.





## సీఎం దృష్టికి నియోజకవర్గ సమస్యలు

**ఆసిఫాబాద్, జనవరి 5, ప్రభాతవార్త:**

ఆసిఫాబాద్ నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఆ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి అజ్మీరా శ్యామ్ నాయక్ ముఖ్యమంత్రి రేవంతరెడ్డిని కోరారు. సోమవారం హైదరాబాద్ లో రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆసిఫాబాద్ నియోజకవర్గ ప్రధాన సమస్యల గురించి ముఖ్యమంత్రి తెలిపినట్లు ఆయన పేర్కొన్నారు.



## ముసాయిదా ఓటరు జాబితాపై అవగాహన సదస్సు

**రామకృష్ణాపూర్, జనవరి 05, ప్రభాతవార్త**

క్యాతన్‌పల్లి మున్సిపాలిటి కార్యాలయంలో సోమవారం అన్ని రాజకీయ పార్టీల నాయకులకు ముసాయిదా ఓటర్ జాభితా పై అవగాహన కల్పించారు.నాయకుల నుండి సూచనలు, సలహాలు, పిర్యాదులు స్వికరించారు. పిర్యాదులపై పారదర్శకంగా విచారణ జరిపి ఎన్నికల అధికారులకు నివేదికలు పింపిస్తామని తెలిపారు.

## కొర్లొంకలో చేప పిల్లల పంపిణీ

**తిర్యాని, జనవరి 05, ప్రభాతవార్త:**

మత్స్యకారుల ఆర్థికాభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం చేప పిల్లలను ఉచితంగా పంపిణీ చేస్తోందని మత్స్యశాఖ జిల్లా అధికారి వై. సాంబశివరావు అన్నారు. సోమవారం మండలంలోని గుడిపేట గ్రామపంచాయతి పరిధిలోని కోర్లొంక డోల్పుల వాగులో 6.72 లక్షల చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకారులకు ఉపాధి అవకాశాలు పెంపుదల దిశగా ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోందన్నారు. చేప పిల్లల వదిలివేత కార్యక్రమం ద్వారా స్థానిక మత్స్యకారులకు ఆదాయ వనరులు మెరుగుపడుతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ ఫీల్డ్ అధికారులు నరేశ్, శంకర్, సర్పంచ్ మడావి తులసి, ఉపసర్పంచ్ కొట్నాక నాందేవ్,మడావి వెంకట్ రావు, కోర్వేత మోతిరామ్,కోర్వేత రాంచందర్,భీంరావ్, కనక దాము, తదితరులు పాల్గొన్నారు.





## బాధితుడికి చరవాణి అప్పగింత

**వాంకిడి, డిసెంబర్ 5, ప్రభాతవార్త :**

వాంకిడి మండలం గోయాగాం ఏరియాకు చెందిన ఎస్కే లతీఫ్ రియల్ మీ మొబైల్ వాంకిడి మార్కెట్ ఏరియాలో పోవడం వల్ల వాంకిడి పోలీస్ స్టేషన్లో కంప్లైంట్ చేయగా పోలీసులు సిఈఐఆర్ పోర్టల్ ద్వారా ట్రేస్ చేసి బాధితుడి కి శరవాణి అప్పగించడం జరిగింది. ఈ సందర్భంగా వాంకిడి ఎస్ఐ మహేందర్ మాట్లాడుతూ మొబైల్ పోయిన లేదా దొంగిలించబడిన ప్రతి ఒక్కరూ కూడా త్వరగా స్పందించి సిఇఐఆర్ పోర్టల్ నందు ఫిర్యాదు నమోదు చేస్తే మొబైల్ ట్రేస్ అవ్వడానికి ఎక్కువ అవకాశం ఉంటుంది తెలియజేశారు. మొబైల్స్ ట్రేస్ చేయుటలో ప్రతిభ కనబర్చిన పోలీస్ కానిస్టేబుల్ నయీమ్ అభినందించారు.

## మండప నిర్మాణానికి విరాళం అందజేత

**కౌటాల, జనవరి 05, ప్రభాతవార్త:**

కౌటాల మండలంలోని తలోడి గ్రామంలో హనుమాన్ ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మిస్తున్న మండపానికి లక్ష ఒక వెయ్యి నూట పదహారు రూపాయలను నూతనంగా ఎన్నికైన సర్పంచ్ టేకం వెంకటేష్ లక్షి ్మ దంపతులు తమ వంతు విరాళంగా ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు.అనంతరం విరాళం అందజేసిన సర్పంచ్ దంపతులను ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు అభినందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఎల్కా రవీందర్, శబరిమల బయలుదేరుతున్న అయ్యప్ప మాలధారణ స్వాములు, మహిళలు ఉన్నారు.



# రోడ్డు భద్రత నియమాలు కచ్చితంగా పాటించాలి

## - ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**ఆదిలాబాద్, జనవరి 5, ప్రభాతవార్త:**

రోడ్డు భద్రత నియమాలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు-2026లో భాగంగా సోమవారం రవాణా శాఖ ఆధ్వర్యంలో స్థానిక ఎన్టీఆర్ కూడలిలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్‌తో కలిసి కలెక్టర్ హీలియం బెలూన్‌ను గాలిలోకి ఎగురవేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో రోడ్డు ప్రమాదాలను తగ్గించి ప్రమాదరహిత ప్రయాణాలు అందించాలనే లక్ష్యంతో రహదారి భద్రతపై వినూత్న కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. రోడ్డు భద్రత అనేది ఒక్క ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాకుండా ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని స్పష్టం చేశారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనాలు నడిపే వారు సీట్‌బెల్ట్ వినియోగించాలని సూచించారు. డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ వినియోగం, మద్యం సేవించి వాహనాలు నడపడం ప్రాణాపాయానికి దారి తీస్తుందని హెచ్చరించారు. ముఖ్యంగా తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు అప్పగించకూడదని, ఇది చట్టరీత్యా నేరమే కాకుండా ప్రమాదాలకు ప్రధాన కారణమవుతుందని అన్నారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, జిల్లాలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగే హాట్‌స్పాట్‌లను గుర్తించి అక్కడ స్పీడ్ బ్రేకర్లు, సూచిక బోర్డులు ఏర్పాటు చేశామని తెలిపారు. వాహనదారుల భద్రత కోసమే నిరంతరం



హీలియం బెలూన్‌ను ఎగురవేస్తున్న కలెక్టర్, ఎస్పీ

డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తున్నామని, ప్రతి ఒక్కరు హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించడం ద్వారా ప్రాణాలను కాపాడుకోవచ్చని సూచించారు. అనంతరం రోడ్డు భద్రత నియమాలపై ఏర్పాటు చేసిన సెల్ఫీ పాయింట్ వద్ద కలెక్టర్, ఎస్పీ, అదనపు కలెక్టర్, అధికారులు ఫోటోలు దిగారు. ఈ సందర్భంగా రోడ్డు భద్రత నియమాలు పాటిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, జిల్లా రవాణా అధికారి శ్రీనివాస్, సీఐ సునీల్, ఇన్‌స్పెక్టర్లు హరీంద్ర కుమార్, ప్రదీప్, రవాణా, పోలీస్ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థుల అభ్యసన సామార్థ్యాలను పరిశీలిస్తున్న ఎసిఎంఓ

# విద్యార్థుల్లో విద్యా సామార్థ్యాలను పెంపొందించాలి

## - ఎసిఎంఓ పి ఉద్దవ్ కుమార్

**తిర్యాని, జనవరి 05, ప్రభాతవార్త:**

విద్యార్థుల్లో విద్యా సామార్థ్యాలను పెంపొందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని కుమ్రం భీం జిల్లా ఏసిఎంఓ పి ఉద్దవ్ కుమార్ కోరారు. సోమవారం తిర్యాని మండలంలోని పంగిడి మాదర ఆశ్రమ పాఠశాలను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. పదవ తరగతి వంద రోజుల ప్రత్యేక ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న పదవ తరగతి విద్యార్థుల గ్రాండ్ టెస్టులు తెలుగు, హిందీ సబ్జెక్టులను పరిశీలించారు.అలాగే ప్రాథమిక, ఉన్నత తరగతుల విద్యార్థుల అభ్యాసన సామార్థ్యాలను, ఆంగ్ల భాష నైపుణ్యాభివృద్ధి కోసం పాఠశాలలో నిర్వహిస్తున్న ఇఎల్‌పి కార్యక్రమాన్ని అలాగే యంగ్ లీడర్ క్లబ్ నిర్వహణ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల అభ్యాసన సామార్థ్యాల పెంపుకు ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. విద్యార్థుల్లో ఆంగ్ల భాష నైపుణ్యాభివృద్ధి పెంపొందించడం కోసం ఆంగ్ల సబ్జెక్టును బోధించే ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు.పదవ తరగతి విద్యార్థులందరూ వందశాతం ఉత్తీర్ణత సాధించేల కృషిచేయాలని ఆయన ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# ఓటరు ముసాయిదాలో తప్పులను సవరించాలి

## - సిపిఐఎం ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్‌కి వినతి

**లక్షెట్టిపేట, జనవరి 05, ప్రభాతవార్త**

లక్షెట్టిపేట మున్సిపాలిటీ పరిధిలోని ఓటర్ల ముసాయిదా జాబితాలో ఉన్న తప్పులను సవరించాలని, అదే విధంగా ఒక వార్డులో ఉన్న ఓటర్లు వేరే వార్డులోకి వెళ్లడం జరిగింది. వాటిని సవరించాలన్నారు. ఈ కార్యక్రమంలో దుంపల రంజిత్ కుమార్ సిపి(ఐ)ఎం మండల నాయకులు, ఎం. దేవవరం సిపిఐ మండల కార్యదర్శి, మధుకర్ దౌడేపల్లి గ్రామ ఉపసర్పంచ్ సత్యం, వార్డ్ సభ్యులు, రవి కిరణ్ సిపిఐ నాయకులు పాల్గొన్నారు.

# ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం

**దహెగాం, జనవరి 5,ప్రభాతవార్త :**

దహెగాం మండలంలో గెర్రే గ్రామంలో ఆర్థిక అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. కళాజాత బృందంచే బ్యాంకు కార్యక్రమాల గురించి తెలియజేశారు. ఈ సందర్భంగా కొంచవెల్లి శాఖ బ్యాంకు మేనేజర్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ బ్యాంకింగ్ సదుపాయాలు, డిజిటల్ లావాదేవీలు, ప్రధానమంత్రి సురక్ష భీమా యోజన, ప్రధానమంత్రి జీవనజ్యోతి భీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, సైబర్ నేరాల పై ప్రజలకు అవగానహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మల్లేశ్వరి, ఉప సర్పంచ్ దందేరా మహేష్, ఆర్థిక అక్షరాస్యత కేంద్రం సిబ్బంది రాజబాబు, శేఖర్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న శాఖ బ్యాంకు మేనేజర్ ప్రవీణ్ కుమార్

# పొతేపల్లిలో గ్రామ సభ

**పెంచికల్ పేట్, జనవరి 5, ప్రభాతవార్త :**



మండలంలోని పోతేపల్లి గ్రామ పంచాయతీలో సర్పంచ్ దుర్గం పోషన్న ఆధ్వర్యంలో సోమవారం గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ పరిధిలో అమలవుతున్న ఉపాధి హామీ పథకం, పంచాయతీరాజ్, ఐకెపి, అంగన్వాడి శాఖల ప్రగతిని సంబంధిత గ్రామ సిబ్బంది సభలో చదివి వినిపించారు. గ్రామంలో నెలకొన్న సమస్యలు రానున్న రోజుల్లో చేపట్టబోయే అభివృద్ధి పనులపై గ్రామసభలో విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా నర్సరీ ఏర్పాటు, వెలుగు బిల్డింగ్, శానిటేషన్ పనులు, మిషన్ భగీరథ ద్వారా తాగునీటి సరఫరా, ఉపాధి హామీ పథకంలో పనిదినాల పెంపు వంటి అంశాలు ప్రధానంగా చర్చకు వచ్చాయి. గ్రామభివృద్ధికి అందరూ సహకరించాలని సర్పంచ్ పోషన్న తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చిన్నయ్య, కార్యదర్శి రాకేష్, వార్డు సభ్యులు వెంకటాచలం, లక్ష్మి, సాయికుమార్, మహేష్, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.


స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న ఏఓ రామకృష్ణ

# ఎరువుల పంపిణీ కేంద్రాన్ని తనిఖీ చేసిన మండల వ్యవసాయాధికారి

**కాగజ్‌నగర్ రూరల్ ,జనవరి 5, ప్రభాతవార్త :**

కాగజ్‌నగర్ మండలంలోని సొసైటి (సహకార సంఘం)లో ఎరువుల పంపిణి కేంద్రాన్ని కాగజ్‌నగర్ మండల వ్యవసాయాధికారి జి. రామకృష్ణ సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సొసైటి సీఈఓ, ఏఈఓలకు పలు సూచనలు, సలహాలు చేశారు. అనంతరం ఎరువులను తీసుకుకేందుకు వచ్చిన రైతులకు యూరియా యాప్‌పై అవగాహన కల్పించారు. యాసంగిలో పంట సాగు చేసిన రైతులకు మాత్రమే యూరియాని ఇవ్వాలని అన్నారు. పంట సాగు చేసిన వివరాలను రైతులు ఏఈఓల వద్ద నమోదు చేసుకోవాలని సూచించారు. ఎరువుల కొరకు ఎలాంటి ఇబ్బంది లేదని అన్నారు. ఎరువుల నిల్వలను ఎప్పటికప్పుడు రైతులకు కలిపించేలా స్టాక్‌బోర్డుపై రాసి ఉంచాలని తెలిపారు. సాగు విషయంలో రైతులకు ఎలాంటి సందేహాలు ఉన్న వనయవసాయ అధికారులను సంప్రదించాలనని అన్నారు. ఆయన వెంట ఏఈఓలు, రైతులు ఉన్నారు.

# 2012 బ్యాచ్ కానిస్టేబుల్ రాథోడ్ విలాస్ గుండెపోటుతో హఠన్మరణం

## - కానిస్టేబుల్ అంత్యక్రియల్లో పాల్గొన్న ఎస్పీ అఖిల్ మహాజన్

## - తక్షణ సహాయర్థం అంతఃక్రియలకై కుటుంబ సభ్యులకు 30 వేలు అందజేత

**ఆదిలాబాద్, జనవరి 5, ప్రభాతవార్త:**

బాధిత కుటుంబానికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని, జిల్లా పోలీసు వ్యవస్థకు కానిస్టేబుల్ మరణం తీరని లోటుఅని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. సోమవారం ఇంద్రవెల్లి పోలీస్ స్టేషన్‌లో విదులు నిర్వర్తిస్తున్న 2012 బ్యాచ్ కానిస్టేబుల్ రాథోడ్ విలాస్(35)కు ఇచ్చోడలో తన స్వగృహం నందు గుండెపోటు రావడంతో, ఇచ్చోడ నుండి ఆదిలాబాద్ రిమ్స్ ఆస్పత్రికి తరలించే క్రమంలో హాస్పిటల్‌లో పరమపదించారు. విషయం తెలుసుకున్న జిల్లా ఎస్పీ వెంటనే తన స్వగ్రామం సోనాల మండలం సంపత్ నాయక్‌తండ నందు జరుగుతున్న అంతఃక్రియలలో పాల్గొని కానిస్టేబుల్ పార్థివదేహానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. స్వర్గస్తులైన కానిస్టేబుల్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. తక్షణ సహాయర్థం అంతఃక్రియల ఖర్చులకై కుటుంబ సభ్యులకు 30 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. పోలీసు వ్యవస్థకు కానిస్టేబుల్ మరణం తీరని లోటుని, బాధిత కుటుంబ సభ్యులకు పోలీసు వ్యవస్థ అందుబాటులో ఉంటూ అన్ని సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐలు డి గురు స్వామి, ఎం ప్రసాద్, ఎస్సైలు సాయన్న, సంజయ్ కుమార్, శ్రీ సాయి, పోలీసు అసోసియేషన్ జనరల్ సెక్రటరీ గిన్నెల సత్యనారాయణ, పోలీసు మిత్రులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్



## ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యతనివ్వండి

**- జీఎం (పర్సనల్) కిరణ్ కుమార్**

**- శ్రీరాంపూర్ ఏరియా పర్సనల్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష**

నస్పూర్, జనవరి 05, ప్రభాతవార్త

సింగరేణి ఉద్యోగుల సంక్షేమానికి అధికారులు అత్యంత ప్రాధాన్యతనివ్వాలని, పెండింగ్‌లో ఉన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంస్థ జనరల్ మేనేజర్ (పర్సనల్, వెల్ఫేర్ అండ్ సీఎస్ఆర్) జీవీ కిరణ్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం కొత్తగూడెంలోని ప్రధాన కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శ్రీరాంపూర్ ఏరియా పర్సనల్ విభాగం అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరాంపూర్ ఏరియాలో కారుణ్య నియామకాలు, పదవీ విరమణ పొందిన ఉద్యోగుల గ్రాట్యుటీ చెల్లింపులు తదితర అంశాలపై ఆయన సుదీర్ఘంగా చర్చించారు. ఈ సమీక్షా సమావేశంలో జీఎం కిరణ్ కుమార్ మాట్లాడుతూ.. శ్రీరాంపూర్ ఏరియాలో కారుణ్య నియామకాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరగా పరిశీలించి అర్హులకు న్యాయం చేయాలని సూచించారు. అలాగే, సాధారణ పదవీ విరమణ పొందిన వారితో పాటు, మెడికల్ ఇన్వాలిడేషన్ అయిన ఉద్యోగుల గ్రాట్యుటీ కేసులను ఎటువంటి జాప్యం లేకుండా పరిష్కరించాలన్నారు. అసిస్టెంట్ లేబర్ కమిషనర్ కార్యాలయం వద్ద పెండింగ్‌లో ఉన్న కేసులను కొలిక్కి తీసుకురావడానికి సరైన విధివిధానాలను రూపొందించుకొని ముందుకు వెళ్లాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. పర్సనల్ విభాగానికి సంబంధించిన ప్రతి పనిని గడువులోగా పూర్తి చేయాలని, ఉద్యోగుల సంక్షేమమే లక్ష ్యంగా ప్రతి అధికారి బాధ్యతగా పనిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డీజీఎం (పర్సనల్) ఎస్. అనిల్ కుమార్, డీవై పీఎం ఎం. రాజేష్, సీనియర్ పీవో ఎస్. సురేందర్, ప్రశాంత్, గనుల సంక్షేమ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## తల్లిదండ్రులపిల్లల బంధాన్ని బలోపేతం చేయడం కోసం హ్యాపీ క్లబ్

**- మందమర్రి శ్రీ చైతన్య పాఠశాలలో హ్యాపీ క్లబ్ కార్యక్రమం ఏర్పాటు**

**- పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్**

మందమర్రి, జనవరి 05, ప్రభాతవార్త

మందమర్రి పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాలలో హ్యాపీ క్లబ్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ప్రిన్సిపాల్ ఎం.రమేష్, డీన్ రవి మాట్లాడుతూ, సి బ్యాచ్‌కు చెందిన 6వ తరగతి నుండి 9 వరకు విద్యార్థులకు పాల్గొన్నారు. హ్యాపీ క్లబ్ అనేది తల్లిదండ్రులను, పిల్లలను సరదా ఆటలు, కార్యక్రమాల ద్వారా కలిపే ఒక కార్యక్రమం, ఇది పిల్లలతో బలమైన బంధాన్ని పెంచుకోవడానికి, వారి భావోద్వేగ తెలివితేటలను మెరుగుపరచడానికి, ఆత్మవిశ్వాసాన్ని పెంచడానికి సహాయపడుతుంది. ఇది విద్యా సంస్థలలో విద్యార్థుల మానసిక శ్రేయస్సు, విద్యా విజయానికి తోడ్పడే ఒక కార్యక్రమమని తెలిపారు. హ్యాపీ క్లబ్ యొక్క ముఖ్య ఉద్దేశాలను తల్లిదండ్రులకు, పిల్లలకు తెలుపుతూ తల్లిదండ్రులపిల్లల బంధాన్ని బలోపేతం చేయడం,సరదా కార్యక్రమాల ద్వారా కుటుంబ సభ్యుల మధ్య అనుబంధాన్ని పెంచుతు, భావోద్వేగ వికాసంతో పిల్లల భావోద్వేగాలను అర్థం చేసుకోవడంలో, నియంత్రించడంలో సహాయపడుతుందని అంతేకాక ఆత్మవిశ్వాసం పెంపునకు పిల్లలలో ఆత్మవిశ్వాసం పెంచడానికి కృషి చేస్తుంది. విద్యా విజయానికి తోడ్పాటులో విద్యా సంస్థలలోని పాఠ్యాంశాలతో పాటు, విద్యార్థులు చదువులో రాణించడానికి ఒక సానుకూల వాతావరణాన్ని సృష్టిస్తుందని హ్యాపీ క్లబ్ యొక్క కార్యక్రమ విశిష్ట వారు వివరించారు. ఈ కార్యక్రమంను నిర్వహించినందుకు వీరిని పాఠశాల యాజమాన్యం డైరెక్టర్ శ్రీవిద్య, చైర్మన్ మల్లంపల్లి శ్రీధర్, ఏజీఎం అరవింద్ రెడ్డి, కోఆర్డినేటర్ నాగరాజులు అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డీన్ రవి, ప్రైమరీ, ప్రీ ప్రైమరీ ఇన్చార్జీలు నూకల సునీత, తిరుమల, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.




# బొగ్గు నాణ్యతలో రాజీవద్దు.. నిర్దేశిత లక్ష్యాలను సాధించాలి

**- శ్రీరాంపూర్ ఏరియా అధికారులతో జీఎం మునిగంటి శ్రీనివాస్ సమీక్ష - గ్రేడ్ తగ్గితే సంస్థకు భారీ నష్టం వాటిల్లే ప్రమాదం**

నస్పూర్, జనవరి 05, ప్రభాతవార్త

సింగరేణి సంస్థ అభివృద్ధిలో బొగ్గు నాణ్యత కీలక పాత్ర పోషిస్తుందని, వినియోగదారులకు అత్యున్నత ప్రమాణాలతో కూడిన బొగ్గును సరఫరా చేయాల్సిన బాధ్యత ప్రతి అధికారిపై ఉందని శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ స్పష్టం చేశారు. సోమవారం శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఏరియా ఉన్నతాధికారులతో బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత, బొగ్గు నాణ్యత అంశాలపై ఆయన విస్తృత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ మాట్లాడుతూ, మార్కెట్‌లో నాణ్యమైన బొగ్గుకు విపరీతమైన డిమాండ్ ఉన్నందున, బొగ్గు ఉత్పత్తి నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. గనుల నుండి వెలికితీసే బొగ్గు గ్రేడ్ తగ్గకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఒకవేళ బొగ్గు గ్రేడ్ తగ్గినట్లయితే సంస్థకు లక్షలాది రూపాయల ఆదాయ గండి పడుతుందని, ఇది సంస్థ ఆర్థిక స్థితిగతులపై ప్రభావం చూపుతుందని హెచ్చరించారు. రవాణా చేసే బొగ్గులో తుంటలు, షేల్, ఐరన్ వంటి ఇతర అనవసర పదార్థాలు కలవకుండా క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను కోరారు. గనుల విభాగంలోని వివిధ శాఖల అధికారులు ఒకరికొకరు సమన్వయంతో పని చేస్తూ నాణ్యత నియంత్రణకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఏరియాకు నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను నిర్ణీత సమయంలోగా చేరుకోవడానికి ప్రతి ఉద్యోగి మరియు అధికారి అంకితభావంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బెల్లంపల్లి రీజియన్ క్వాలిటీ జనరల్ మేనేజర్ వీరభద్ర రావు, ఎస్వోటు జీఎం ఎన్. సత్యనారాయణ, ఏరియా ఇంజనీర్ టి. రమణ, ఏజెంట్లు కుర్మ రాజేందర్, ఎన్. శ్రీధర్, జి. రవికుమార్, ప్రాజెక్ట్ ఆఫీసర్లు ఏ. వెంకటేశ్వర రెడ్డి, చిప్ప వెంకటేశ్వర్లు, క్వాలిటీ మేనేజర్ కె. వెంకటేశ్వర్ రెడ్డి, ఏరియా రక్షణాధికారి విజయకుమార్, డీజీఎంలు ఆనంద్ కుమార్, రవీందర్, మల్లయ్య, అన్ని గనుల మేనేజర్లు, గ్రూప్ ఇంజనీర్లు ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.





## నూతన తపాల కార్యాలయాన్ని ప్రారంభించిన సర్పంచ్

బజార్‌హత్నూర్, జనవరి 05, ప్రభాతవార్త:

మండల కేంద్రంలోని నూతన తపాలా (పోస్టాఫీస్) కార్యాలయాన్ని సోమవారం సర్పంచ్, ఉప సర్పంచ్, బిపిఎం భాగ్యశ్రీలు ప్రారంభించారు. ఎన్నో సంవత్సరాలుగా అద్దె భవనాల్లో ఉన్న తపాల కార్యాలయం సోమవారం గ్రామ పంచాయితీకి సంబంధించిన సెటర్ రూమ్ ఇవ్వడం జరిగింది. ఇలా రూమ్ ఇవ్వడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పరచ సాయన్న, ఉపసర్పంచ్ కొంగర్ల శారద రాజన్న, బిపిఎం భాగ్యశ్రీ, మండల యువజన సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్, గ్రామస్తులు వినీల్, లక్కం శంకర్, భోజన్న, పోతన్న తదితరులు పాల్గొన్నారు.

## చిన్నతనం నుండే క్రీడల పట్ల ఆసక్తి చూపాలి

**- సర్పంచ్ పల్దె అక్షర**

దిలావర్‌పూర్, జనవరి 5, ప్రభాతవార్త:



క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని సర్పంచ్ పల్దె అక్షర అన్నారు. సోమవారం దిలావర్‌పూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి క్రీడా పోటీలు ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పల్దె అక్షర మాట్లాడుతూ చిన్నతనం నుంచే క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలన్నారు. పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చని పేర్కొన్నారు. చదువుతోపాటు క్రీడలపై మక్కువ చూపాలని సూచించారు. వాలీబాల్ బాలిక విభాగంలో దిలావర్‌పూర్ ఉన్నత పాఠశాల విద్యార్థినిలు సోనీ అశ్విని శ్రావణి శరణ్యం, కేజీబీవీ నుండి శ్రావణి అక్షయ లిప్సిక, బన్సపల్లి పాఠశాల నుండి ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. టేబుల్ టెన్నిస్ బాలికల విభాగంలో కేజీబీవీకి చెందిన మేఘన ఆకాంక్ష మణిప్రియలు ఎంపికయ్యారు. బాలు రవి భాగంలో దిలావర్పూర్ కు చెందిన రితీష్ వికాస్, గుండంపల్లికి చెందిన రామ్ చరణ్‌లు జిల్లాస్థాయిలో ఎంపికయ్యారు. ఇందులో మండల విద్యాధికారి సదానందం, వ్యాయామ ఉపాధ్యాయుడు అంబాజీ, శారద, జయ, నాయకులు అనిల్ పాల్గొన్నారు.

## ఎన్ని కుట్రలు చేసినా చివరికి న్యాయమే గెలిచింది

జన్నారం, జనవరి 5, ప్రభాతవార్త



మాజీ మంత్రి, ఎమ్మెల్యే, శాసనసభా పక్ష ఉప నాయకులు హరీష్‌రావుపై కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా చివరికి న్యాయమే గెలిచింది అని బిఆర్ఎస్ పార్టీ మంచిర్యాల జిల్లా కార్యదర్శి జాడి గంగాధర్ అన్నారు. ఫోన్ ట్యాపింగ్ పేరుతో ఆయనపై బురదజల్లి రాజకీయంగా ఇబ్బంది పెట్టాలని చూసిన రాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు తీర్పు ఒక చెంపపెట్టఅని, ఎటువంటి ఆధారాలు లేవని తెలిసినా కేవలం కక్షసాధింపు కోసమే సుప్రీంకోర్టు వరకు వెళ్లిన కాంగ్రెస్ ప్రభుత్వానికి అక్కడ చుక్కెదురు కావడం హర్షణీయం అని అన్నారు. ఇకపై ఫోన్ ట్యాపింగ్ కేసులో హరీష్ రావుని విచారించేందుకు వీల్లేదని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేయడంతో ఆయనపై వచ్చిన ఆరోపణలన్నీ అబద్ధాలని తేలిపోయాయి అని అన్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతున్న నాయకుల గొంతు నొక్కాలని చూస్తే ఫలితం ఇలాగే ఉంటుంది అని పేర్కొన్నారు. అక్రమ కేసులు పెట్టి వేధించడం మానుకొని, ఇప్పటికైనా ప్రభుత్వం పరిపాలనపై దృష్టి పెట్టాలని,అబద్ధపు ప్రచారాలు, రాజకీయ కుతంత్రాలు ఎంతో కాలం సాగవని, చివరికి ధర్మమే నిలబడుతుందని ఈ తీర్పు ద్వారా మరోసారి స్పష్టమైందని అన్నారు.

## విభాగ్ స్థాయి ఖేల్ కూద్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

బజార్‌హత్నూర్, జనవరి 4, ప్రభాతవార్త:

శ్రీ సరస్వతీ విద్యా పీఠం ఆధ్వర్యంలో జనవరి 3, 4 తేదీల్లో శ్రీసరస్వతీ శిశుమందిర్ ముధోల్ పాఠశాలలో విభాగ్ స్థాయి ఖేల్ కూద్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో బజార్‌హత్నూర్ పాఠశాల బాల బాలికలు ఉత్సాహంగా పాల్గొని వివిధ విభాగాల్లో ఉత్తమ ఫలితాలు సాధించారు. శిశు వర్గ విభాగంలో కబడ్డీ పోటీల్లో ద్వితీయ స్థానం, ఖోఖో పోటీల్లో ద్వితీయ స్థానం పొందారు. వ్యక్తిగత స్పర్ధలలో బాలురు విభాగంలో హైజంప్‌లో కొంగర్ల రాహుల్ ప్రథమ స్థానం, 100 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానం సాధించాడు. 400 మీటర్లు, 200 మీటర్ల పరుగు పందేలలో జాదవ్ సాహినాథ్ ద్వితీయ స్థానంలో నిలిచాడు. బాలికల విభాగంలో 100 మీటర్ల పరుగు పందెంలో అంగ శివాని ద్వితీయ స్థానం, హైజంప్‌లో కొంగర్ల హర్షిని ద్వితీయ స్థానం గెలుచుకున్నారు. విజయం సాధించిన బాల బాలికలకు ప్రబంధ కారిణి సభ్యులు ముత్యపువార్ నాగనాథ్, కొత్త శంకర్, చట్ల ఉత్తమ్, పోలోజు రాజన్న అభినందనలు తెలియజేసి బహుమతులు అందజేశారు.



# మున్సిపల్ ఎన్నికల కొరకు ఏర్పాట్లు పూర్తి చేయాలి

## - జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేష్ ధోత్రే

**ఆసిఫాబాద్, జనవరి 5, ప్రభాతవార్త:**

మున్సిపల్ ఎన్నికల నిర్వహణ కొరకు ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు లతో కలిసి ఆసిఫాబాద్, కాగజ్ నగర్ మున్సిపల్ కమిషనర్లు, వార్డు అధికారులు, బిల్ కలెక్టర్లతో మున్సిపల్ ముసాయిదా ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాల గుర్తింపు, కేంద్రాలలో ఏర్పాట్లు, మున్సిపల్ పరిధిలోని ఇంటి పన్ను వసూలు అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా ఈ నెల 8వ తేదీ వరకు ఓటరు జాబితాపై అభ్యంతరాలు స్వీకరించి పరిష్కరించాలని తెలిపారు. ఒకే కుటుంబంలోని ఓటర్లు ఒకే వార్డులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని, ఆసిఫాబాద్ లో 20 వార్డులు, కాగజ్ నగర్ మున్సిపాలిటీలో 30 వార్డులకు గాను పోలింగ్ కేంద్రాలలో వసతుల కల్పనకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. మున్సిపాలిటీలో 2025 26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఇంటి పన్ను, ఇతర పన్నులు శత శాతం వసూలు చేయాలని, అన్ని వార్డులలో పారిశుద్ధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టి ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని తెలిపారు. ప్రతి రోజు ఇంటింటి నుండి చెత్తను సేకరించాలని, స్వచ్ఛ మున్సిపాలిటీలలో భాగంగా జిల్లాలోని ముంచిపాలిటీలను పరిశుభ్రంగా ఉంచేలా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్లు గజానన్, రాజేందర్, వార్డు అధికారులు, బిల్ కలెక్టర్లు పాల్గొన్నారు.

# నూతన సర్పంచులకు సన్మాన కార్యక్రమం

**సారంగాపూర్, జనవరి 05, ప్రభాతవార్త:**

మండలంకేంద్రంలోని రైతు వేదికలో ఎంపీడీవో ఆధ్వర్యంలో ఏర్పాటు నూతన సర్పంచులకు సన్మాన వేడుకను చేశారు. ఎమ్మార్వో సంధ్యారాణి, ఎంపీడీవో లక్ష్మీకాంత్‌లు సర్పంచ్‌లకు శాలువాతో సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన సర్పంచులందరికీ శుభాభివందనాలు అని తెలిపారు. గ్రామానికి ప్రథమ పౌరులు మీ బాధ్యతలు ఐదు సంవత్సరాల వరకు ప్రజలకు ఉంటాయని, మీరు మేము కలిసి మెలిసి ప్రజలకు అన్ని రకాలుగా సేవలు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ అజీజ్ ఖాన్, ఏపీవో సాగర్, ఏఈఓ అరుణ్, పంచాయితీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది, సర్పంచులు, నాయకులు, తదితరులు హాజరైనారు.



విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్యులు శ్రీవిద్య

# కేజీబీవీ విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు

**దిలావర్‌పూర్, జనవరి 5, ప్రభాతవార్త:**

దిలావర్‌పూర్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో వైద్యులు శ్రీవిద్య వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె తన సిబ్బందితో పాటు పాఠశాల విధులు నిర్వహిస్తున్న ఏఎన్ఎం పుష్ప పుష్ప సహకారంతో విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేపట్టారు. అనంతరం వైద్యులు మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యంపై నిరంతర పర్యవేక్షణ అవసరమని, పాఠశాలలో తరచుగా ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తామని తెలిపారు. పరిశుభ్రత పాటించడం సమయానికి ఆహారం తీసుకోవడం, వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించడం వంటి అంశాలపై విద్యార్థులకు సూచనలు ఇచ్చారు. ఇందులో ప్రత్యేక అధికారి అపర్ణ, ఏఎన్ఎం శృతి, ఆశాలు శోభ, గంగామణి, తదితరులు ఉన్నారు.



# మాలధారుల మహాయాత్ర

## - శబరిమలకు స్వాముల సమూహ సాగరం
## - 41 రోజుల మండల దీక్ష అనంతరం శబరిమల యాత్ర

**మందమర్రి,జనవరి 5,ప్రభాతవార్త:**

సోమవారం గురు స్వామి బత్తుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో హరిహర దేవస్థానం నుండి అయ్యప్ప మాలికల భక్తి ప్రవాహంతో శబరిమల యాత్రకు బయలుదేరిన స్వాముల బృందం ఆధ్యాత్మిక ఉత్సాహంతో ముందుకు సాగింది. నల్లని దుస్తులు ధరించి, మాల వేసుకున్న స్వాములు భక్తిభావంతో ఖగస్వామియే శరణం అయ్యప్పగగ అంటూ నినాదాలు చేస్తూ ప్రయాణం మొదలుపెట్టారు. వ్రతం పాటిస్తూ 41 రోజులు కఠిన నియమాలు పాటించిన ఈ భక్తులు శబరిమల దర్శనం కోసం ఉత్సాహంగా వెళ్లారు. ఇరుముడి కట్టుతో, పవిత్రమైన భక్తితో వారు కేరళలోని పవిత్ర క్షేత్రం వైపు అడుగులు వేయగా, కుటుంబ సభ్యులు, స్నేహితులు వీడ్కోలు పలికి ఆశీర్వాదాలు అందించారు. ఈ యాత్రలో భక్తులు ఐక్యత, సమానత్వం, త్యాగాన్ని ప్రదర్శిస్తూ ముందుకు సాగారు. శబరిమల సీజన్‌లో లక్షలాది మంది భక్తులు ఈ పవిత్ర యాత్రలో పాల్గొంటారని, ఈ బృందం సురక్షితంగా దర్శనం చేసుకుని తిరిగి రావాలని అందరూ మనస్ఫూర్తిగా కోరారు. అయ్యప్ప భక్తి సంప్రదాయం ఏటా కొత్త ఉత్సాహాన్ని నింపుతోందని, స్వామి శరణు అయ్యప్ప,ఈ నినాదంతో భక్తుల ప్రయాణం కొనసాగింది.

# మీ సేవా కేంద్రాల నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలి

## - మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య

**నస్పూర్, జనవరి 05, ప్రభాతవార్త**



జిల్లాలోని మీ సేవా కేంద్రాల నిర్వాహకులు తమ కేంద్రాల నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశం మందిరంలో జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ, ఈ డిస్ట్రిక్ట్ మేనేజర్ సునీల్‌లతో కలిసి మీసేవ కేంద్రాల నిర్వాహకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మీసేవ కేంద్రాలు ప్రభుత్వానికి, ప్రజలకు వారిధిగా ఉంటూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాల కొరకు దరఖాస్తు చేసుకునేందుకు వేదికగా పని చేస్తున్నాయని, మీ సేవ కేంద్రాల నిర్వాహకులు తమ విధులను సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. మీసేవ నిర్వాహకులు తమ కేంద్రాల పని వేళలను ఖచ్చితంగా పాటించాలని, వివిధ సేవలకు సంబంధించి దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం నిర్దేశించిన ధరల పట్టికను ప్రతి మీ సేవ కేంద్రంలో ప్రజలకు కనిపించే విధంగా ప్రదర్శించాలని తెలిపారు. నిర్దేశిక రుసుముకు మించి వసూలు చేయకూడదని, దరఖాస్తు సమయంలో జాగ్రత్తలు వహించాలని తెలిపారు. ప్రతి మీ సేవ కేంద్రంలో హెల్ప్‌లైన్ నెంబర్, సంబంధిత తహసిల్దార్ పేరు, మొబైల్ నెంబర్ తప్పనిసరిగా ప్రదర్శించాలని తెలిపారు. మీసేవ కేంద్రాల కాల పరిమితి ముగిసిన వారు మార్చిలోగా తమ అనుమతులను పునరుద్ధరించుకోవాలని తెలిపారు. మీసేవ కేంద్రం పొందిన వారు మాత్రమే కేంద్రాన్ని నిర్వహించాలని, వివిధ సేవల నిమిత్తం మీ సేవ కేంద్రానికి వచ్చే ప్రజలతో మర్యాదగా వ్యవహరించాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కనీస సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అర్హత గల ప్రతి రైతుకు గుర్తింపు సంఖ్య కేటాయించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని, ఈ ప్రక్రియ నిర్వహించేందుకు మీ సేవా కేంద్రాలకు అవకాశం కల్పించడం జరిగిందని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రక్రియ నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రత్యేక సెలవులు మంజూరు చేయాలి

**దిలావర్‌పూర్, జనవరి 5, ప్రభాతవార్త:**

ప్రత్యేక సెలవులను మంజూరు చేయాలని కోరుతూ సోమవారం దిలావర్పూర్ మండల కేంద్రంలోని మండల విద్యాధికారి సదానందంకు ఉపాధ్యాయులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భముగా వారు మాట్లాడుతూ వేసవిలో జరిగిన ఐదు రోజుల శిక్షణ కార్యక్రమానికి సంబంధించిన ఈఎల్ఎస్, సీప్ సర్వే చేసినటువంటి ఉపాధ్యాయులకు 5 ప్రత్యేక సెలవులను మంజూరు చేయాలని వారిని కోరారు. ఈ విషయంపై ఎంఈఓ సానుకూలంగా స్పందించారని వారు పేర్కొన్నారు.




# టీఎస్ యుటిఎఫ్ నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

**బజార్‌హత్నూర్, జనవరి 05, ప్రభాతవార్త:**

మండలంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో సోమవారం టీఎస్ యుటిఎఫ్ ఆధ్వర్యంలో నూతన 2026 క్యాలెండర్‌ను ప్రధానోపాధ్యాయులు జె భూమన్న చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు భగత్ బాపురావ్, ప్రధాన కార్యదర్శి పాముల మల్లయ్య, ఉపాధ్యాయులు సర్పే చందన్ బాబు, మనోహర్, మంగులాల్, ప్రతాప్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ స్థాయి పోటీలలో జిల్లా గాయకులు సత్తా చాటాలి

## - నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**నిర్మల్‌రూరల్, జనవరి 5, ప్రభాతవార్త:**

జాతీయ స్థాయి పోటీలలో జిల్లా గాయకులు సత్తా చాటాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయి యువజన ఉత్సవాల పోటీల్లో ప్రతిభ కనబరిచి, జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన జిల్లాకు చెందిన విద్యార్థులను కలెక్టర్ అభిలాష అభినవ్, కలెక్టరేట్లోని తన చాంబర్లో సోమవారం అభినందించారు. యువజన ఉత్సవాలలో భాగంగా నిర్వహించిన పాటల పోటీలలో విద్యార్థులు, ఏ మంజుల, ఎస్ కావ్య, టి శ్రుతి, కె అనుష్క, టి సాత్విక, సాయి కృప, బి గంగామణి, ఆర్ శ్రీనిధి, పి శివప్రసాద్, ఎస్ బ్రహ్మయ్యల బృందం ఉత్తమ ప్రతిభ కనబరిచింది. జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఢిల్లీలో జరగబోయే జాతీయ స్థాయి పాటల పోటీలలో సత్తా చాటి, జిల్లా పేరు నిలబెట్టాలని ఆకాంక్షించారు. వారికి శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి శ్రీకాంత్ రెడ్డి, విద్యార్థులు, తదితరులు ఉన్నారు.



## జిల్లా ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా దమ్మ నారాయణ

**లక్షెట్టిపేట, జనవరి 05, ప్రభాతవార్త**

జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యునిగా లక్షెట్టిపేట మున్సిపాలిటీ మోదెలకు చెందిన చెందిన దమ్మ నారాయణను నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. అట్టి నియమకు పత్రాన్ని దమ్మ నారాయణకు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ,ఎస్టీ చట్టాన్ని దుర్వినియోగపరిచిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునేలా కృషి చేస్తానని పేర్కొన్నారు. ఎస్సీ,ఎస్టీల అభివృద్ధికి కట్టుబడి ఉంటానని, దళిత వర్గాల అభ్యున్నతికై కృషి చేస్తానని ఆయన తెలిపారు. తన నియామకానికి సహకరించిన కాంగ్రెస్ పార్టీ నాయకులకు, అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గత కొన్ని సంవత్సరాలుగా వివిధ రకాలుగా చేస్తున్న సేవలను గుర్తించి, రాష్ట్ర ప్రభుత్వం విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ జిల్లా సభ్యునిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం పట్ల లక్షెట్టిపేట మండల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

### సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తాను..

జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యునిగా నియామకమైనందుకు సంతోషంగా ఉందన్నారు. ఎస్సీ,ఎస్టీల అభివృద్ధికై కట్టుబడి వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని అన్నారు. తనకు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు.

## సమన్వయంతో గ్రామాభివృద్ధి చేయాలి

**- ఎం.పి.డి.ఓ సత్య నారాయణ**

**జైపూర్, జనవరి 05, ప్రభాతవార్త**

అధికారుల సమన్వయంతో గ్రామాలలో అభివృద్ధి పనులు చేపట్టాలని ఎం.పి.డి.ఓ సత్య నారాయణ అన్నారు. సోమవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లను శాలువాలతో సత్కరించి ఘనంగా సన్మానం చేశారు. ఈసందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ సర్పంచులు అధికారులు సమన్వయంతో పని చేస్తూ గ్రామాలలో నెలకొన్న సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి, అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. అనంతరం, జైపూర్ మండలంలోని పలు అభివృద్ధి పనుల గురించి సర్పంచులకు వివరించారు. గ్రామ పంచాయతీల సర్పంచులు అందరికీ పరిచయం చేసుకోన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ వనజ, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ విద్యాసాగర్, ఎంపీఓ శ్రీపతి బాపు రావు,పంచాయతీ రాజ్ ఏ.ఈ బి. రాజ్ కుమార్, కార్యాలయ సూపరింటెండెంట్ భాగ్య లక్ష్మి, బెజ్జలా వేముల స్రవంతి రాజనర్సు,ఎల్కంటి సర్పంచ్ గూడెల్లి శ్రీనివాస్ రెడ్డి,ఇందారం సర్పంచ్ ఎండీ. ఫయాజ్,కుందారం సర్పంచ్ కే. వినోద,మిట్టపల్లి సర్పంచ్ కే.మనోహర్, నర్సింగాపూర్ సర్పంచ్ తుంగపిండి తిరుపతి, నర్వ సర్పంచ్ ఎగ్గిడి స్రవంతి లింగన్న, పెగడపల్లి సర్పంచ్ రామన్న, వి.సుధ, పిరాజశేఖర్, సెట్ పల్లి సర్పంచ్ జే.సరస్వతి గోపాల్, శివ్వారం సర్పంచ్ టి.అంజన్ గౌడ్ టేకుమట్ల సర్పంచ్ బల్ల వెంకటేష్, వేలాల సర్పంచ్ దేగ స్వప్న నగేష్, వెంకట్రావ్ పల్లి సర్పంచ్ జే. లక్ష్మి, పంచాయితీ కార్యదర్శులు, ఈ.జి.ఎస్ సిబ్బంది, కార్యాలయ సిబ్బంది, గ్రామ ప్రజలు హాజరైనారు.



## ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

**ఉట్నూర్,జనవరి 5, ప్రభాతవార్త**

ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులపై క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించే విధంగా అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని ఉట్నూర్ సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మార్మాట్ అన్నారు. సోమవారం ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలపై అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. మంచిర్యాల మండలం కోటపల్లి గ్రామానికి చెందిన వినోద్ తనకు పట్ట మంజూరు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. బేలా మండల కేంద్రానికి చెందిన కనకే శివకుమార్ తనకు ల్యాప్ ట్యాప్ అందించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. జైనూర్ మండలం పానపటర్ గ్రామానికి ఆత్రం కాపీ బాయి తమకు లోన్ మంజూరు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు పింఛన్, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని దరఖాస్తులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు అధికారి మాట్లాడుతూ ప్రజావాణిలో అందిన దరఖాస్తులను సంబంధిత శాఖల సమన్వయంతో త్వరితగతిన పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ఉట్నూర్ సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మార్మాట్

## సాథీ కార్యక్రమంతో ఐఐటీ మద్రాస్ శిక్షణా పర్యటన

**- స్లేట్ హై స్కూల్ విద్యార్థులకు స్ఫూర్తిదాయక అనుభవం**

**జన్నారం, జనవరి 5, ప్రభాతవార్త**




కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ మరియు ఐఐటీ కాన్పూర్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా అమలవుతున్న సాథీ కార్యక్రమం ద్వారా, మంచిర్యాల జిల్లా జన్నారం పట్టణంలోని స్లేట్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ కు చెందిన 10 మంది ప్రతిభావంతమైన విద్యార్థులు మరియు ఒక ఉపాధ్యాయుడు మూడు రోజుల శిక్షణా పర్యటనగా ఐఐటీ మద్రాస్‌ను సందర్శించారు. ఈ పర్యటనను సాథీ–కేంద్ర హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ శిక్షణా పర్యటనలో భాగంగా విద్యార్థులు ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయోటెక్నాలజీ, ఏరోస్పేస్, యుఏవీ (డ్రోన్స్), సివిల్ ఇంజినీరింగ్ వంటి విభాగాలను సందర్శించి, లావా ల్యాంప్, కెమికల్ బల్బ్ వంటి శాస్త్రీయ ప్రయోగాలను ప్రత్యక్షంగా వీక్షించారు. అలాగే క్రయోజెనిక్ టెక్నాలజీ, సీఎంఎస్ టెక్నాలజీ వంటి ఆధునిక సాంకేతిక రంగాలపై నిపుణుల ద్వారా అవగాహన పొందారు. ఐఐటీ మద్రాస్‌లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులతో పరస్పర సంభాషణ జరిపిన స్లేట్ విద్యార్థులు, జేఈఈ వంటి పోటీ పరీక్షలకు అవసరమైన సిద్ధత విధానాలు, క్రమశిక్షణ, విద్యా ప్రయాణం గురించి ప్రేరణాత్మక సమాచారాన్ని పొందారు. అనంతరం చెన్నైలోని గజేంద్ర సర్కిల్ – కేవీ గ్రౌండ్‌లో నిర్వహించిన శాస్త్ర సాంకేతిక ఎక్స్‌పోను సందర్శించి, ఐఐటీ మద్రాస్, భారత నౌకాదళం, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషన్ టెక్నాలజీ ప్రదర్శించిన ఆధునిక సాంకేతిక నమూనాలను ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా సాథీ కార్య నిర్వాహకుడు ఇషాంత్ దూబే (కేంద్ర హైదరాబాద్) మాట్లాడుతూ, ఇలాంటి శిక్షణా పర్యటనలు విద్యార్థుల్లో దాగి ఉన్న సామర్థ్యాన్ని వెలికితీసి, ఐఐటీ మద్రాస్ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థలపై విశ్వాసాన్ని పెంచుతాయి. భవిష్యత్ లక్ష్యాలను స్పష్టంగా నిర్దేశించుకునేందుకు ఇవి ఎంతో దోహదపడతాయి అని తెలిపారు. మార్గదర్శక ఉపాధ్యాయులు కె. భీమ్ రావు మాట్లాడుతూ, ఈ పర్యటన సిద్ధాంత జ్ఞానం మరియు ప్రాయోగిక అనుభవం మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించి, విద్యార్థులను సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథమెటిక్స్ రంగాల వైపు బలంగా ప్రోత్సహించింది అని పేర్కొన్నారు. ఈ అపూర్వ అవకాశాన్ని కల్పించిన సాథీ కార్యక్రమానికి స్లేట్ విద్యార్థులు మరియు ఉపాధ్యాయులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## కొండయ్య మహారాజ్ జయంతి ఉత్సవాల పోస్టర్ విడుదల

**సిర్పూర్ (టి), జనవరి 5, ప్రభాతవార్త :**

కొండయ్య మహారాజ్ జయంతి ఉత్సవాల సందర్భంగా ఈ నెల 16వ తేదీ నుంచి 22వ తేదీ వరకు మహారాష్ట్ర రాష్ట్రం చంద్రపూర్ జిల్లా గొండ్ పిప్రి తాలూకా దాబా గ్రామంలో జాతర కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు కొండయ్య మహారాజ్ ట్రస్ట్ అధ్యక్షులు సుహాన్ మడవర్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో కొండయ్య మహారాజ్ జయంతి ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్లను ఆయన కమిటీ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జయంతి ఉత్సవాల పురస్కరించుకొని నిర్వహిస్తున్న యాత్రలో భాగంగా ఏడు రోజుల పాటు వివిధ ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. జాతరలో పాల్గొనే భక్తుల సౌకర్యార్థం ప్రతిరోజూ అన్నదానం ఏర్పాటు చేస్తున్నామని, కావున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కొండయ్య మహారాజ్ జయంతి యాత్రను, జాతరను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కమిటీ సభ్యులు సూచించారు. ఈ కార్యక్రమంలో దేవదాస్, అశోక్, భవన్, రామకృష్ణ, సచిన్, యోగిదాస్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ట్రస్ట్ అధ్యక్షులు సుహాన్ మడవర్, కమిటి సభ్యులు

## విద్యుత్ ఫిర్యాదులకై టోల్ ఫ్రీ సేవలు

**ఆసిఫాబాద్, జనవరి 5, ప్రభాతవార్త:**



విద్యుత్ వినియోగదారులకు మరింత మెరుగైన సేవలు అందించే క్రమంలో 1912 టోల్ ఫ్రీ సేవలను మరింత విస్తృత పరిచామని కుమురంభీమ్ ఆసిఫాబాద్ సర్కిల్ సూపెరింటెండింగ్ ఇంజనీర్ ఉత్తమ్ జాడె సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్పొరేట్ కార్యాలయం నుండి టోల్ ఫ్రీ సేవలు నిర్వహించబడుతున్నాయని, జిల్లాలోని విద్యుత్ వినియోగదారులు ఈ టోల్ ఫ్రీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సాంకేతికతను జోడించి సిబ్బందిని పెంచి టోల్ ఫ్రీ సేవలను మరింత పటిష్టపరిచామని తెలిపారు. 24 గంటల పాటు టోల్ ఫ్రీ నంబర్ 1912 విద్యుత్ ఫిర్యాదుల నిమిత్తం వినియోగదారులకు అందుబాటులో ఉంటుందన్నారు. విద్యుత్ సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తినా, బిల్లులో ఏమైనా హెచ్చుతగ్గులు ఉన్నా, ఫ్యూజ్ ఆఫ్ కాల్స్, విద్యుత్ మీటర్ల మార్పు, అన్ని రకాల కొత్త సర్వీసుల మంజూరుకు సంబంధించిన పేరు మార్పు, క్యాటగిరి మార్పు, లోడ్ మార్పు తదితర సమస్యల కొరకు టోల్ ఫ్రీ నంబర్లో సంప్రదించి సేవలు పొందగలరని కోరారు.